క్లుప్తంగా

తరగతులు విలీనం వల్ల ఇబ్బందులు



విస్సన్నపేట: విద్యావ్యవస్థలో జరుగుతున్న తరగతుల విలీనం వలన విద్యార్థులకు ఇబ్బంది అని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కె.లక్ష్మీకళ్యాణికి సోమవారం వినతిపత్రం అందజేసారు. ప్రభుత్వం చేపట్టిన విలీన ప్రక్రియతో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3,4.5 తరగతులు వేరే పాఠశాలల్లో విలీనం చేయటం వల్ల విద్యార్థులు దూరాభారం వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేకల జ్ఞానరత్నం, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు



తిరువూరు:ఏకొండూరు మండలం కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన కొండా రాజ్‌కుమార్‌కు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా స్థాయిలో పురస్కారాలు అందుకోవడంతో పాటు సాంఘికశాస్త్ర బోధనలో ప్రతిభా పాటవాలు చూపిన రాజ్‌కుమార్ విద్యార్థుల మన్ననలు అందుకున్నారని ప్రధానోపాధ్యాయుడు ఆదిశేషు అభినందించారు. ఉపాధ్యాయులు రాజారావు, గంగాధర్, కృష్ణారావు, ఎస్ఎంసీ చైర్మన్ ఏలియాబాబు తదితరులు రాజ్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించారు.

మౌలిక వసతులు కల్పించాలి



తిరువూరు:నగర పంచాయతీలోని 17వ వార్డు సాయిరాఘవ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సామాజిక కార్యకర్త ఎం.రాంప్రదీప్ నగర పంచాయతీ కమిషనర్ మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీలో రోడ్లు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో బురదమయమవుతున్నాయని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఇళ్ల ముందు నిలిచిపోతోందని పేర్కొన్నారు. వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

పీఎన్‌బీఎస్ డెప్యూటీ సీటీఎంగా పవన్‌కుమార్

బస్‌స్టాండ్(విజయవాడపశ్చిమ): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా సీహెచ్ఎస్ పవన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నూజివీడులో డిపో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన పీఎన్‌బీఎస్‌లో డెప్యూటీ సీటీఎంగా పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్‌స్టేషన్ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఇప్పటి వరకు డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నర్రా శ్రీనివాసరావు సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు.

రైతులను ముంచిన మొక్కజొన్న కంపెనీ

నూజివీడు: విత్తన మొక్కజొన్న (సీడ్ మొక్కజొన్న) కంపెనీ మండలంలోని గొల్లపల్లికి చెందిన రైతులను నిండా ముంచేయడంతో లబోదిబోమంటున్నారు. నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన 28మంది పేద రైతులు ఎకరా రూ.30 వేలకు కౌలుకు తీసుకొని పెదవేగి మండలంలో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీ ఆర్గనైజర్లు చెప్పిన మాటలు నమ్మి సీడ్ మొక్కజొన్నను సాగు చేశారు. సాగుచేసే ముందు ఎకరాకు మూడు నుంచి ఐదు టన్నుల దిగుబడి వస్తుందని, దానిని టన్ను రూ.30 వేలకు తామే కొనుగోలు చేస్తామంటూ ఆర్గనైజర్లు నమ్మబలకడంతో సాగు చేసేందుకు ముందుకు వచ్చారు.

నష్ట పరిహారం ఇస్తామని చెప్పి....

ఒకవేళ దిగుబడి రాకపోతే ఎకరాకు రూ.90 వేలు నష్టపరిహారం అందజేస్తామని చెప్పడంతో గ్రామంలో వీరంతా కలిసి 80 ఎకరాల్లో విత్తన మొక్కజొన్నను సాగు చేయగా దిగుబడి మాత్రం అర టన్ను నుంచి టన్ను మాత్రమే వచ్చింది. కంపెనీ మాత్రం అడ్వాన్సుగా ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి ఇచ్చింది. వచ్చిన దిగుబడిని సైతం కంపెనీనే తీసుకొని వారికి దిగుబడి తాలూకా డబ్బులు చెల్లించకుండా, నష్టపరిహారం ఇవ్వకుండా పేద రైతులను గాలికొదిలేసింది. దీంతో వారు ఏమి చేయాలో తెలియక సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తమకు కంపెనీ నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కౌలు కాకుండా ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు పెట్టుబడి అయిందని, దిగుబడి చూస్తే బాగా తక్కువ అవ్వడంతో చేసిన అప్పులు ఎలా తీరతాయో తెలియడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నష్టపరిహారం ఇప్పించాలని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

ఎకరంన్నరకు 2 టన్నుల దిగుబడి



ప్రైవేట్ కంపెనీకి చెందిన విత్తన మొక్కజొన్న పంటను ఎకరంన్నరలో సాగు చేస్తే కేవలం 2 టన్నుల మాత్రమే దిగుబడి వచ్చింది. దీనికి పెట్టుబడి కింద రూ.1.20 లక్షలు అవ్వగా, కంపెనీ అడ్వాన్స్‌గా రూ.30 వేలు అయ్యాయి. మిగతా మొత్తం అప్పుచేసి సాగు చేశా. దిగుబడి వచ్చిన 2 టన్నుల మొక్కజొన్నను తీసుకెళ్లారు గానీ ఇంకా వాటి తాలూకా డబ్బులు ఇవ్వలేదు.

–చిమటా శ్రీనివాసరావు, గొల్లపల్లి

డబ్బులు చెల్లించలేదు



ఎకరాకు రూ.32వేలు చొప్పున కౌలుకు తీసుకొని 4 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్నను సాగు చేశా. ఎకరాకు రూ.25 వేలు చొప్పున అడ్వాన్స్ ఇచ్చారు. రూ.3.20 లక్షలు పెట్టుబడి కాగా, ఎకరాకు కేవలం ఒక టన్ను చొప్పున మాత్రమే దిగుబడి వచ్చింది. కంపెనీ చెప్పినంత కాకుండా దిగుబడి బాగా తగ్గింది. పండిన మొక్కజొన్నలను తీసుకెళ్లారే కానీ ఇంత వరకు డబ్బులు చెల్లించలేదు.

–పలగాని శ్రీనివాసరావు, గొల్లపల్లి

మంత్రికి వినతిపత్రం అందజేత

నూజివీడు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ సోమవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి వినతిపత్రాన్ని అందజేశారు. 2018లో కాంట్రాక్టు ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌లో ఎంపికైనప్పటికీ మాకు గెస్ట్ ఫ్యాకల్టీ అని డిజిగ్నేషన్ ఇచ్చారని, గత ఏడేళ్లుగా రూ.25 వేల వేతనానికే పనిచేస్తున్నామని, ఇంత వరకు తమకు వేతనం ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. 2021లో ఏపీ ప్రభుత్వం జీవో నెంబరు 110 ఇచ్చినప్పటికీ దాని ప్రకారం కూడా జీతాలు పెరగలేదని, తమను ఇంతవరకు కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చలేదని వాపోయారు. 2018 నుంచి మా సర్వీసును పరిగణనలోకి తీసుకొని వేతనాలను పెంచాలని, తమ డిజిగ్నేషన్ మార్చాలన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ నజీర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు మణికిరణ్, సెక్రటరీ అలజింగి రమాదేవి, లోకనాథ్, లక్ష్మణ్‌నాయుడు, సిద్ధార్థ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కొలుసు పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్ ఐటీల్లో పనిచేసే గెస్ట్ ఫ్యాకల్టీ

మురుగునీరు నిలిచి ఇబ్బందులు

చాట్రాయి: మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తుమ్మగూడెం యూపీ స్కూలు వద్ద గృహాల్లో వాడుకున్న మురుగు నీటికి అడ్డుకట్ట వేశారు. దీంతో పాఠశాలల్లో వాడుకున్న మురుగు నీరు డ్రెయినేజీలోకి రాక నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడంతో స్కూల్లోని విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచ్‌కి, పంచాయతీ కార్యదర్శికి చెప్పినా సమస్య పరిష్కారం కావడంలేదని కాలనీ వాసులు చెబుతున్నారు. స్కూలు వద్ద మురుగు నీటిని తొలగించకపోవడంతో గ్రామానికి చెందిన కనకారావు సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.



మురుగు నీరు పారకుండా వేసిన అడ్డకట్ట

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వంగా వ్యవహరించొద్దని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.

ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా తప్పనిసరిగా అర్జీలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒకవేళ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 25 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌పీఓ సుందరి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, హెచ్ఓ ఆర్ హేమ, కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, ట్రిపుల్ ఐటీ ఎస్ఐ జీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

సర్టిఫికెట్ కోర్సులు వినియోగించుకోండి

మైలవరం:సర్టిఫికేట్ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఫండమెంటల్ అకౌంటింగ్, ట్యాలీ, కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆపరేటింగ్ సర్టిఫికేట్ కోర్సులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం డిగ్రీలో చేరబోయే విద్యార్థులకు ఈ అవకాశం కల్పించామని చెప్పారు. మైలవరం ప్రాంతం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కోర్సులు కాల పరిమితి 30 రోజులు అని, అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందిస్తామని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, కామర్స్ విభాగాధిపతి సీఎం శ్రీనివాసరావు, జి.నారాయణరావు, కె.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి

క్రైమ్ ఎస్ఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం

ఇబ్రహీంపట్నం:పోలీస్ స్టేషన్ క్రైమ్ ఎస్ఐగా సేనాపతి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడే క్రైమ్ ఎస్ఐగా ఆయన విధులు నిర్వహించారు. వివిధ చోరీ కేసుల్లో నిందితులను పట్టుకోవడంతో పాటు దుర్గమ్మ ఆలయంలో వెండి రథం విరగగొట్టిన కేసును ఛేదించి ఉన్నతాధికారులతో ప్రసంశలు, ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో ఇక్కడి నుంచి నున్న పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి సింగ్‌నగర్, గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు ఉత్తర్వుల మేరకు మరలా క్రైమ్ ఎస్ఐగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ చంద్రశేఖర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐలు విజయలక్ష్మీ, పాపారావు, ఫణీంద్ర, లక్ష్మణరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



సీఐ చంద్రశేఖర్‌ను కలిసిన క్రైమ్ ఎస్ఐ సేనాపతి శ్రీనివాసరావు

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఇబ్రహీంపట్నం:పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌లకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద పారిశుద్ధ్యం కార్మికులతో కలసి ఎంఈఓ సీహెచ్ పుష్పలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ సమానపనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో బాత్‌రూమ్స్, క్లాస్ రూమ్స్ శుభ్రం చేస్తున్న వారికి వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలుతో పాటు ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, యూనిఫాం, సబ్బులు, చీపుర్లు, బ్రష్‌లు, ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. సీఐటీయు మండల ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని లోకేష్ పేరుతో ఫ్లెక్సీ...

మైలవరం:లోకేష్ అన్నా మా ఊరి సమస్యను పరిష్కరించండి అంటూ వెల్వడం గ్రామంలో సోమవారం ఫ్లెక్సీలు వెలిశాయి. మైలవరం నుంచి వెల్వడం, చంద్రాల గ్రామాల మీదుగా నూజివీడు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారైంది. గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్నా మైలవరం నుంచి గణపవరం క్రాస్ రోడ్డు, చంద్రాల వెళ్లే రహదారులను పట్టించుకోకపోవడం, రోడ్లు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు చర్యలు తీసుకుంటారని ఈ రహదారిలో స్థానికులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు.



వెల్వడం ఆర్ అండ్ బీ రహదారిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన

తిరువూరు:ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ 4న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ తిరువూరు నగరపంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు బాజీ, మస్తాన్, శ్రీను, కలాం, రఫీ, సుజాత పాల్గొన్నారు.



తిరువూరు నగర పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

సమాజానికి ఉపాధ్యాయులు దిక్సూచి



ముసునూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని, సమాజానికి దిక్సూచి వంటిదని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. మండలంలోని చెక్కపల్లి హైస్కూల్లో ఉద్యోగ విరమణ పొందిన హిందీ ఉపాధ్యాయురాలు పద్మావతి సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. హెచ్ఎం అల్లాబక్షు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పద్మ కిషోర్, రాంబాబు, ఉపాధ్యాయులు, పద్మావతి దంపతులను సత్కరించి నూతన వస్త్రాలు, జ్ఞాపికలు బహూకరించారు. యూటీఎఫ్ జిల్లా నేతలు జి.వెంకటేశ్వరరావు, గాంగేయుడు, అనూరాధ, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం పల్టీ కొట్టి వ్యక్తికి గాయాలు



తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): కుక్క అడ్డొచ్చి ద్విచక్రవాహనం పల్టీ కొట్టిన ఘటన తుమ్మలపాలెం మైనింగ్ చెక్‌పోస్ట్ వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎన్టీటీపీఎస్ రెండో స్టేజ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి చిరంజీవి గాయపడ్డాడు. ఎన్టీటీపీఎస్ ఉద్యోగి చిరంజీవి వ్యక్తిగత పనులపై ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడకు వెళుతున్నాడు. తుమ్మలపాలెం చెక్‌పోస్ట్ వద్దకు చేరుకున్న సమయానికి పరుగెత్తుకుంటూ వచ్చిన కుక్క అనూహ్యంగా ద్విచక్రవాహనానికి తగిలి పల్టీకొట్టి చిరంజీవి గాయపడ్డాడు. రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు గాయపడిన వ్యక్తికి సపర్యలు చేసి ప్రైవేట్ వాహనంలో విజయవాడ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసుపై విచారణ చేపట్టారు.

నిమ్రా ఫార్మసీలో ఘనంగా స్టార్టప్ ఎగ్జిబిషన్



జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఫార్మసీ కాలేజీలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (11సీ) ఆధ్వర్యంలో సోమవారం స్టార్టప్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన స్టార్టప్ ఐడియాలు, ఆవిష్కరణలు, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులు, ఔషధ నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టులు ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి, డెప్యూటీ డైరెక్టర్ సయ్యద్ గులాం గౌస్, కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మెట్ట పైర్లకు లాభదాయకంగా వర్షం



చాట్రాయి: అడపా దడపా కురుస్తున్న వర్షాలు మెట్ట పైర్లకు లాభదాయకంగా మారుతున్నాయి. మండలంలో 450 ఎకరాల్లో పత్తి, 560 ఎకరాల్లో ఖరీఫ్ మొక్కజొన్నతో పాటు పెసర, కంది, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. అంతేగాక దాదాపు 9,800 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు పోసిన వరి నార్లు ఈ వర్షానికి కళకళలాడుతున్నాయి. విత్తిన విత్తు మొలుస్తుండగా మొలకెత్తిన మొక్క ఏపుగా పెరుగుతుంది. వెదచల్లిన వరి సాగుకు ఈ వర్షం అనుకూలంగా మారుతుందని రైతులు చెబుతున్నారు.

ప్రమాదకరంగా క్రాస్‌రోడ్లు

జి.కొండూరు:శివారులోని 30వ నంబరు జాతీయ రహదారి నుంచి ఆత్కూరు, పినపాక గ్రామాలకు వెళ్లే రెండు క్రాస్‌రోడ్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల జాతీయ రహదారిని ఆనుకొని కృష్ణా వాటర్ పైపులైను ఏర్పాటు కోసం ఈ రెండు రహదారులను జాతీయ రహదారిని కలిసే ప్రదేశంలో అడ్డంగా తవ్వారు. ఆ తర్వాత పైపులైను వేసి పూడ్చారు. అయితే ఆత్కూరు క్రాస్ రోడ్డు వద్ద పూడ్చిన ప్రదేశంలో నేల కుంగిపోయి రహదారికి అడ్డంగా గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అదేవిధంగా పినపాక క్రాస్‌రోడ్డు వద్ద తవ్విన ప్రదేశంలో కుంగిపోయి గొయ్యి ఏర్పడడంతో పాటు పూడ్చేందుకు తరలించిన మట్టి పూడ్చకుండా వదిలేయడంతో ఎత్తుగా గట్టులాగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఈ రెండు క్రాస్‌రోడ్లపై పైపులైన్ కోసం తవ్విన ప్రదేశంలో సరిచేయకపోతే రాత్రి సమయాలలో ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పినపాక క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్న ప్రదేశం



ఆత్కూరు క్రాస్‌రోడ్డు వద్ద పైపులైను కోసం తవ్విన ప్రదేశంలో ఏర్పడిన గొయ్యి